కడచూపు

"ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్..."

"హలో"

"నంద కిశోరున్నడా"

"నేను నందకిశోర్‌నే మాట్లాడుతున్నాను. మీరెవరు?"

"తమ్మీ నేను బోజన్నని"

"అన్నా! బాగున్నరా?"

"మేం బాగున్నంగని, మన ఆయి..."

"ఏమైంది ఆయికి?"

"ఇప్పుడే కాలం జేసింది"

"............................"

"మొన్న పండుగకు నేనచ్చినపుడు బాగుండెగదా?"

"నిన్నడి దాక మంచిగుండె, ఇయ్యల్ల పొద్దుగల్ల లేసిన్నుంచి ఛాతి నొప్పని తండ్లాడింది. ఆర్మారు నుంచి డాక్టరును పిలిపిచ్చె లోపల, అంతా అయిపోయింది"

"మనోల్లందరికి కవరు జేసింద్రా?"

"దగ్గెరోల్లకు మనుషులను పంపినం. ఫోనున్నోల్లకు ఫోన్ల సెప్పుతున్నం. సేసెతందుకు నాలుగయిదు కొట్టేట్లున్నయి. అప్పటిలోపల నువ్వస్తవా?"

టైము చూశాను. పదకొండు గంటలు....రెండు వందల కిలో మీటర్లు....కారులో మూడున్నర గంటలు.... వెళ్ళాలి. తప్పకుండా వెళ్ళాలి.

"ఎందుకురాను. తప్పకస్త. నెనచ్చేదాక సూడుండ్రి"

"అయితాయె. నువ్వచ్చెదాక సూస్తం."

ఫోను క్లిక్ మన్న చప్పుడు. మనసంతా శూన్యం!

బామ్మ!

ఎన్ని స్మృతులు

ఎన్ని జ్ఞాపకాలు!

తొంభై ఏళ్ళ వయసులో కూడా కర్ర సహాయంతో బాగానే నడిచేది. కళ్ళద్దాల గూండానైతేనేం, అందరిని గుర్తుపట్టేది. నెల క్రితం ఊరు వెళ్ళినప్పుడు ఆరోగ్యంగానే ఉంది. పండగకు చేసిన సకినాలు ఇచ్చింది. ఇంత త్వరగా ఈ వార్త వినవలసి వస్తుందనుకోలేదు.

"అమీర్" డ్రైవర్‌ను పిలిచాను.

"అమీర్ సెలవులో ఉన్నాడు సార్! వాళ్ళ చెల్లెలి పెళ్ళి" ఆశీర్వాదం చెప్పాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది డ్రైవర్ సెలవుల్లో ఉన్నాడని. ఇప్పుడెలా? నాకు డ్రైవింగ్‌రాదే? వస్తానని మాటిచ్చాను. కారులో వెళితేగాని చేరలేను.

"ఆశీర్వాదం! ఎవరైనా డ్రైవర్ దొరుకుతాడేమో చూడు"

"కనుక్కొని వస్తాను సార్!"

ఒకటి...రెండు...మూడు...పదినిమిషాలు.

ఆశీర్వాదం జాడ లేదు. నాకేమో టెన్షన్‌గా ఉంది.

లాభం లేదు. అమీర్‌నే పిలిపించాలి.

"ఎవ్వరూ దొరకలేదు సార్. గంగాగౌడ్ జీపుకూడా పెళ్ళికి పొరుగూరు పంపారట" రొప్పుకుంటూ ఆశీర్వాదం.

"అర్జంటుగా అమీర్‌ను పిలుచుకురా".

మరో పదినిమిషాలు.

"సార్!" అమీర్

"పద మా ఊరు వెళ్ళాలి. రాత్రివరకు తిరిగి వద్దాం".

"ఒక్కగానొక్క చెల్లి. ఇంటి పెద్దకొడుకును. శుభకార్యం వదిలి మీరు రమ్మంటే మయ్యత్‌కి (చావుకు) వస్తాను. మీరు మాకు చేసిన ఉపకారం మరవలేను."

చల్లబడ్డాను. నేను బలవంతం చేస్తే అమీర్ వస్తాడు. కాని? నాకది భావ్యమా? నా ఉపకారానికి నేనే వెల కట్టి తీసుకోవాలా? సరే? కాని బామ్మ కడచూపు?

అది కూడా ముఖ్యమే. నా హోదా ప్రదర్శించాలా?

అమీర్ తరపున ఆలోచించాలా?

చివరకు మానవత్వం గెలిచింది.

బస్సులోనే ఊరు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను. అమీర్ కళ్ళల్లోనీళ్ళు.అతని భుజంతట్టి బయలుదేరాను. ఆశీర్వాదం తనస్కూటర్‌పై దగ్గరి టౌన్లో దింపాడు.

అదృష్టం! ఎక్స్‌ప్రెస్ బస్ దొరికింది. మరే ఆవాంతరం ఎదురుకాకపోతే సరియైన సమయానికి చేరుకోవచ్చు. బస్సు నడుస్తోంది. నా ఆలోచనలు పరుగెడుతున్నాయి. బామ్మ! నా ప్రియమైన బామ్మ.

అందరినీ అక్కున చేర్చుకునే బామ్మ. ఎవరింట్లో ఏ కార్యమైనా, తన భుజాలపై వేసుకుని చేసే బామ్మ. క్షణం తీరికలేకుండా పనిచేసి, చేసి అందరి భోజనాలైన తర్వాతే తినేది. అడుగంటిన అన్నం ఆరోగ్యానికి మంచిదంటూ మాడిన అన్నం కూడా తృప్తిగా తినేది. అన్నం పారెయ్యడానికి ఆమె మనసొప్పేది కాదు. అంత వయసులో కూడా బామ్మ అప్యాయత అణుమాత్రం తగ్గలేదు.అదే పలకరింత, అదే అనురాగం. ఆ బామ్మ ఇక లేదంటే....జీర్ణించుకోలేక పోతున్నాను.'చదివింది చాలు ఇక ఇల్లు,వ్యాపారం చూసుకో' అని నాన్నఅన్నప్పుడు...

"నా మనుమడు కలెక్టర్ కావలె" అని నాన్నతో దెబ్బలాడి మరీ సిటీలో కాలేజీ చదువుకి నాన్నను ఒప్పించి

అంబల్ల జనార్దన్

నన్ను ప్రోత్సహించింది. బామ్మ కోరిక మేరకు కలెక్టరుని కాకపోయినా, ఒక జాతీయ బ్యాంకులో మేనేజరునయ్యాను. తదుపరి ప్రమోషన్ కోసం, తప్పని సరైన రూరల్ ఎక్స్‌పీరిఎన్స్ కోసం, ఈ మారుమూల పల్లెకు రావాల్సి వచ్చింది.

ఇప్పుడు?

నన్ను సదా ప్రోత్సహించిన బామ్మను కడసారిగా చూడగలనో లేదో? బస్సు ఆగింది. కామారెడ్డి అనుకుంటాను. డ్రైవర్, కండక్టరు టిఫిన్‌కి వెళ్ళారు. పదిహేను నిమిషాలు. బస్సు కదలదే? ఈ ఆర్టీసీ వాళ్ళు, అన్నీ తాపీగా చేస్తారు. అయినా, నా పిచ్చిగానీ నాకున్న అవసరం, ఆదుర్దా వారికెందుకుంటుంది?

బస్సు కదిలింది. టైము చూశాను. ఇంకా రెండు గంటల ప్రయాణం. మనసు మనసులో లేదు.

*** *** ***

హమ్మయ్య!

మా ఊరు వచ్చింది. బస్సుదిగాడు.

మనసంతా ఉద్విగ్నంగా ఉంది,

బామ్మ. బామ్మ: బామ్మ! బామ్మ రూపమే కళ్ళముందు కదలాడుతోంది. ఇంటికి చేరాను.

అందరూ తడిబట్టలతో ఉన్నారు.

అయిపోయింది. అంతా అయిపోయింది.

నా భయం నిజమైంది.

నా కొరకు నాలుగు గంటల దాకా చూసి, అంతిమ సంస్కారం చేశారట, కులపెద్దలు.

"అయిదు గొట్టెదాక ఉంచుతమంటివి గదనే" భోజన్నను పట్టుకొని భోరుమన్నాను.

"అన్నాను కానీ తమ్మీ, సలికాలం, పొద్దుగూకముందే అన్ని పనులూ సెయ్యాలని కులమోల్లు ఆగం జేసిన్రు, ఇక మన ఆయి మనకు లేదు తమ్మీ. ఆకరి దాక నిన్నే యాదిజేసింది తమ్మీ" భోజన్న కూడా దుఃఖం ఆపుకోలేకపోయాడు.

బంధువులంతా చుట్టుముట్టారు. శోకాలు తీస్తూ ఏడుస్తున్నారు. నా మనసు మూగబోయింది. బామ్మ కడచూపు కూడా నాకు ప్రాప్తం లేదు. పెద్ద ఉద్యోగం, హోదా, కారు, డ్రైవరు ఇవ్వన్నీ ఉండి ఏం ప్రయోజనం? మనసులో కుమిలిపోతున్నాను. నా దురదృష్టానికి నలిగిపోతున్నాను. అంతా ఊరడించారు.

'సచ్చిపోయిన ఆయి తిరిగస్తదే' పుట్టినోల్లు గిట్టక తప్పుతదే, ఒల్లకెంత కాలం గీ భూమ్మీద నూకలుంటె అంతదాక బతుకుతరు. ఆమెకేం, మారాణి జీవితం పూర్తిగా అనుభగించింది. మనుమలను, మనుమరాండ్లను జూసుకున్నది.ఆల్ల పెండ్లిల్లు జూసింది. ముని మనుమలను కూడా సూసుకునే. దేవుడు పిలిసిండు పోయింది. రకరకాల సాంత్వనలు, అవన్నీ నాకూ తెలును, కాని మనసూరుకోదే.నా ప్రగతికి బాటవేసిన బామ్మ కడచూపుకు కూడ నోచుకోలేకపోయానే, అని నా వేదన.

మర్నాడు వేకువ జామునే, తిరిగి ప్రయాణం. ఆపీసు అలానే వదిలివచ్చాను. ఎన్నో పనులున్నాయి.

ఇన్స్‌పెక్షన్లున్నాయి. ఆడిట్ కంప్లయన్స్ పంపాలి.

కొన్ని రిటర్న్‌స్ పంపాలి... బస్సులో కూర్చున్నాను.

మనసులో మళ్ళీ బామ్మ. అసలు అమీర్‌ను తీసుకుని, కారులో వచ్చి ఉంటే ఈ క్షోభ ఉండేదికాదు. మానవత్వం, కాకరకాయా అంటూ అనవసర సెంటిమెంట్‌తో బామ్మ కడచూపు దక్కకుండా చేసుకున్నాను. వాళ్ళ సెంటిమెంట్ కొరకు జీవితాంతం కుమిలిపోయేలా చేసుకున్నాను. ఈ మనసు కోత భరించలేకుండా ఉన్నాను.

బామ్మ నన్ను క్షమించదు. ఎప్పటికీ క్షమించదు.

'నందూ...నందూ....' కళ్ళు తెరిచి చూస్తే...ఒక వర్చస్సు! అది బామ్మగా మారింది.

ఇది కలా?....నిజమా? చేయి గిల్లుకున్నాను.

కలకాదు. నిజమే.

"నీ మీద నాకేమీ కోపం లేదు నందూ. నా కడచూపుకు నోచుకోలేదని వాపోతున్నావా? అమీర్‌ను తీసుకుని కారులో రాలేకపోయినందుకు మథనపడుతున్నావా? తప్పుబాబూ, తప్పు. అమీర్‌ను బలవంతం చేసి నా అంతిమ సంస్కారానికి నువ్వు హాజరైతే, నిన్ను క్షమించే దాన్ని కాదు. నిండా పండిన ఆకు, రాలక తప్పదు గదా? దాని కొరకు, దాంపత్య జీవితంలో అడుగుపెట్టబోతున్న రెండు యువ జీవితాలను బాధపెట్టుడు ఏం భావ్యం? వారి కుటుంబానికి మనఃస్తాపం కలిగించడం న్యాయం కాదు. నీ అవసరానికి, నీ హోదా ప్రదర్శించి, ఎంతో జీవితం మిగిలి ఉన్న వారిని, వారి ఆనంద క్షణాలను దూరం చేసే హక్కు నీకు లేదు. నువ్వు చేసిందే రైటు. అందుకే నా ఆశీస్సులు ఎప్పుడూ నీ వెంటే ఉంటాయి. ఇలాగే మానవత్వంతో ముందుకు సాగు. విజయం నిన్ను వరిస్తుంది. పది కాలాలపాటు చల్లగా వర్ధిల్లుకన్నా".....

"సార్, సార్...మీ స్టేజి వచ్చింది" కండక్టరు కుదుపుతో ఉలిక్కిపడి లేచాను. బస్సు దిగాను. ఇప్పుడు నా మనస్సు ప్రశాంతంగా ఉంది.

*(నా యాభయ్యవ జన్మదినం తేది **9.11.2000** నాడు పరమపదించిన మేనత్త శ్రీమతి జక్కుల బుచ్చమ్మ స్మృతికి... రచయిత)*